## ఉద్యమకారులకిచ్చిన హామీలు అమలు చేయాలి



ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీయూజేఏసీ ప్రతినిధులు

కలెక్టరేట్, మే 30 : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీలు అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎలుగు కవిత ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు ఆర్డీవో మహేశ్వర్‌ను కలిసి హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉచిత ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వడం, ఉద్యమకారులకు సమరయోధులుగా గుర్తించి, ప్రతి నెలా రూ.30వేల గౌరవ వేతనం మంజూరు, ఒక్కో ఉద్యమకారుడికి రూ.20లక్షల ప్రమాద బీమా సౌకర్యం, అమరవీరుల పేర స్మృతి వనం ఏర్పాటు, ప్రభుత్వ పథకాల మంజూరులో మొదటి ప్రాధాన్యత, నామినేటెడ్ పోస్టుల్లో ఉద్యమకారులను నియమించడం, తదితర హామీల అమలుకు వెంటనే కార్యాచరణ ప్రారంభించాలన్నారు. లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో విడుతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అమరగాని మమత, మీసాల కాంతమ్మ, హసీనాబేగం, రిజ్వాన, అనుషా, ఎ.ప్రత్యూష, మాధవి, గనాతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు కలువ పూల కనువిందు



గొల్లపల్లి భూంకుంట చెరువులో చూపరులకు కనువిందు చేస్తున్న కలువ పూలు

శంకరపట్నం, మే 30: జాతీయ రహదారి పక్కన కలువ పూలు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో భూంకుంట చెరువు ఉంది. అప్పట్లో రహదారికి కాస్త దూరం ఉండే ఈ దారి ఇటీవల జాతీయ రహదారి –563 నాలుగు లేన్ల విస్తరణలో భాగంగా ఈ చెరువును ఆనుకొని వెళ్తున్నది. ప్రస్తుతం చెరువులో కలువ పూలు నిండుగా విరగ పూయడంతో పరిసరాలు కనువిందు చేస్తున్నాయి. కరీంనగర్–వరంగల్ జిల్లా కేంద్రాలను కలిపే ఈ రహదారిపై సొంత వాహనాలలో వెళ్లే ప్రయాణికులు ఇక్కడ కాసేపు ఆగి అందాలను తిలకిస్తున్నారు.

# అనుమతుల పేరిట.. అక్రమ తవ్వకాలు

- టిప్పర్లను పట్టించిన గ్రామస్తులు



అధికారులు పట్టుకున్న మట్టి టిప్పర్లు

తిమ్మాపూర్, మే 30: రోడ్డు నిర్మాణం కోసమని అనుమతి తీసుకొని గడువు ముగిసినప్పటికీ మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అధికారులకు పట్టించారు. నేషనల్ హైవే కోసమని పోలంపల్లి శివారులో ఒక ప్రైవేట్ సంస్థ మట్టి తవ్వకాల కోసం అనుమతులు తీసుకొని గుట్ట వద్ద మట్టిని తవ్వి సరఫరా చేస్తున్నది. ఈ క్రమంలో అనుమతులు పూర్తయి ఐదు రోజులు అవుతున్నా యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు మట్టి తవ్వకాలను నిలిపివేయించి అధికారులకు అప్పగించారు. అనంతరం అధికారులు ఆ వాహనాలను తిమ్మాపూర్‌లోని తాసిల్దార్ కార్యాలయంలో పెట్టారు. 12 టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టించగా.. రెండు టిప్పర్లు పరారైనట్టు తెలిసింది. మిగిలిన వాటిపై మైనింగ్ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బుడిగ కొండయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం మట్టి అవసరాల కోసం వంద క్యూబిక్ మీటర్లకు అనుమతిస్తే మాఫియా వెయ్యి క్యూబిక్ మీటర్లు తవ్వి గుట్ట రూపురేఖలు లేకుండా చేశారని ఆరోపించారు. తాను అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశానని, అయినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఈ విషయంలో ఎంత వరకైనా వెళ్తానని, అవసరమైతే హైకోర్టుకు వెళ్లి స్టే తెస్తానన్నారు. అనుమతులు ఉన్నప్పుడు ఎక్కువ తవ్వినా పట్టించుకోలేదని, ఇప్పుడు గడువు ముగిసినా ఏ అధికారి కూడా కన్నెత్తి చూడలేదని, తాము బలవంతం చేస్తేనే వచ్చారని ఆరోపించారు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తెలంగాణచౌక్, మే 30: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామన్నారు. 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మీద పాలకుల అజమాయిషి లేకుండా పోయిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు చేపడుతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పొనగంటి కేదారి, కిన్నెర మల్లవ్వ, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు రాజు, మచ్చ రమేశ్, హేమంత్ పాల్గొన్నారు.

## పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టరేట్, మే 30 : 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్‌స్కాలర్‌షిప్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, అంగవైకల్యం గల విద్యార్థులు జూన్ 30లోగా ఆన్‌లైన్ ద్వారా httpm//telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ ధ్రువీకరణపత్రాలు అప్‌లోడ్ చేయాలని, శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, రాబోయే విద్యాసంవత్సరం కోసం 1, 5వ తరగతుల్లో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 1వ తరగతికి (నాన్ రెసిడెన్షియల్) 86 సీట్లు, 5వ తరగతికి(నాన్ రెసిడెన్షియల్) 89 సీట్లు ఉండగా, వీటిలో ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జూన్ 1 నుంచి దరఖాస్తులు లభిస్తాయని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జత చేసిన అర్జీలను జూన్ 16 సాయంత్రం 5గంటల్లోపు నగరంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

శంకరపట్నం, మే 30: నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మానకొండూర్ ఏడీఏ శ్రీధర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం రైతు వేదికలో సింగిల్ విండోల సిబ్బందితో పాటు ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు, డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్ కాపీలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, సరిగ్గా నిర్వహించాలని ఏడీఏ సూచించారు. ఎరువులను తప్పనిసరిగా పీవోఎస్ మిషన్ ద్వారానే విక్రయించాలని, రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఎంఆర్‌పీ ధరలకు అమ్మాలని లేదా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంఏవో వెంకటేశ్, ఏఈవో రాజ్‌కుమార్, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

BUSINESS OFFER

★ మీ ఇంటి వద్ద ఉండే రోజుకు 2 గం॥ల చేతివ్రాత ద్వారా నెలకు 10 వేల నుండి 15 వేల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. Ph: 63044 84084.

NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు


ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189


## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు



లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గంగాధర, మే 30: చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మంగపేట జీవీఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని 721 మంది లబ్ధిదారులకు కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు బైరిశెట్టి సంపత్, సత్తు కనకయ్య, కంకణాల రాజగోపాల్‌రెడ్డి, రోమాల రమేశ్, దాతు అంజి తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

చొప్పదండి, మే 30: మండలంలోని గుమ్లాపూర్ నుంచి చిట్యాలపల్లి వరకు రూ. 4.44 కోట్ల నిధులతో నిర్మించే తారు రోడ్డు పనులను అధికారులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అలాగే చొప్పదండి పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనుల పురోగతిని స్థానిక నాయకులతో పర్యవేక్షించారు. పనుల్లో జాప్యం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

## ముగిసిన సీపీఎల్ క్రికెట్ పోటీలు

చొప్పదండి, మే 30: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నెల రోజులుగా జరుగుతున్న సీపీఎల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో పట్టణంలోని 13వ వార్డు జట్టు విజయం సాధించగా, నాలుగో వార్డ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. విజేత జట్టుకు కప్‌తో పాటు రూ.20 వేల ప్రైజ్ మనీ, రన్నరప్ జట్టుకు కప్‌తో పాటు పదివేల పారితోషికాన్ని అందజేసి అభినందించారు. కాగా, విజేతలకు ఎస్‌వీజేసీ కళాశాలల డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ బహుమతులు సమకూర్చారు. అంతకు ముందు ఉదయం ఫైనల్ క్రికెట్ పోటీలను ఎస్ఐ సురేందర్, ట్రైనీ ఎస్ఐ మనీషా ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మరిమడ్ల రాజిరెడ్డి, సందీప్, శ్రావణ్, తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మే 30: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ(బీఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ పిలుపు నిచ్చారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కనీస వేతన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించకపోవడంతో కోటి మంది కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, సత్యం, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

## రాష్ట్ర పరిశీలకుడిగా ఇందుర్తి ఉపాధ్యాయుడు

చిగురుమామిడి, మే 30: ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు భాషబత్తిని ఓదెల కుమార్ రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడిగా ఎస్సీఆర్టీ ద్వారా నియామకమయ్యారు. ఈ మేరకు ప్రస్తుతం నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో కొనసాగుతున్న భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయ శిక్షణ శిబిరాలను ఆయన సందర్శిస్తున్నారు. కాగా, రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడిగా ఓదెలు కుమార్ నియామకంపై మండలంలోని రేకొండ స్వగ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## సమష్టి కృషితోనే వేసవిలో నిరంతర సరఫరా

ముకరంపుర, మే 30: అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమష్టి కృషితోనే వేసవి కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయడం ద్వారా వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేసినట్లు ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు పేర్కొన్నారు. పలు చోట్ల పీటీఆర్‌లతో పాటు కొత్తగా 325 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మరో 355 ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచడం వల్ల ఓవర్ లోడ్ సమస్యను అధిగమించామని తెలిపారు. ఇవే కాకుండా 9 వీసీబీల ఏర్పాటు, 13సబ్ స్టేషన్ల పరిధిలో 39 కిలోమీటర్ల మేర ఇంటర్ లింకింగ్ వ్యవస్థ అందు బాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. 600కేవీఆర్ సామర్థ్యం కలిగిన 23, 33/11 కేవీ సబ్ స్టేషన్లలో 201ఎంవీఆర్ కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని ఎస్ఈ అభినందించారు.

## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తెలంగాణచౌక్, మే 30: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల స్వీకరణకు శనివారం డీఎం కార్యాలయంలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో–1 డీఎం విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, తిమ్మాపూర్, మానకొండూర్, బెజ్జంకి, వీణవంక మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 8121993780 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రైతులకు అవగాహన

గంగాధర, మే 30: వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 29 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గంగాధర, గర్శకుర్తి రైతు వేదికల్లో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ మండలి శాస్త్రవేత్త బ్రజేంద్ర, సునీత కోట, కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావు, వేణుగోపాల్, ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'బడిబాట'

చిగురుమామిడి, మే 30: మండలంలోని చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ముల్కనూర్ తదితర అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. పాఠశాలల్లోని సౌకర్యాలు, సాధిస్తున్న ఫలితాల గురించి వివరించారు. తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కాగా, ఈ విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి వచ్చి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల విద్యాధికారి వి. పావని తెలిపారు.

## కరెంటు కోతలతో ఇబ్బందులు

గంగాధర, మే 30: మండలంలోని మంగపేట గ్రామంలో తీవ్ర కరెంటు కోతలతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నట్లు ఆల్ ఇండియా రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు బైరి గంగారెడ్డి తెలిపారు. గ్రామంలో మూడు రోజులుగా గంటల తరబడి కరెంటు ఉండడం లేదని, తీవ్రమైన ఉక్కపోతతో చిన్నపిల్లల ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సైతం మధ్యాహ్నం 12 నిలిచిపోయిన కరెంటు సరఫరా, సాయంత్రం 6 గంటల వరకు రాలేదన్నారు. సంబంధిత ఏడీ, ఏఈ, లైన్‌మెన్‌ను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించిన కరెంటు కోతలు లేకుండా చూడాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

## ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

హుజూరాబాద్ టౌన్, మే 30: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బుల్లితెర హాస్యనటుడు ఆర్ ఎస్ నంద హాజరై మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం, క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెంసారపు సమ్మయ్య, అధికారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిప్రసాద్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 30: నగరంలోని వావిలాలపల్లె ఫీడర్‌లో కొత్త డీటీఆర్ పనులు చేపడుతున్నందున శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు బ్యాంక్ కాలనీ రోడ్ నంబర్ 1, 2, 3, వివేకానంద డిగ్రీ కాలేజీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## బక్రీద్ పండుగకు గోవధ చేయకూడదు

కలెక్టరేట్, మే 30: బక్రీద్ పండుగ నేపథ్యంలో ముస్లింలు గోవధ చేయకూడదని, ప్రభుత్వ నిషేధాన్ని ఉల్లంఘించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మజ్లిస్ తహఫ్పుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహ్మద్ ఘియాస్ కోరారు. బక్రీద్ పండుగలో ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులను వధించడం చట్టరీత్యా నేరమనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలోని మిగతా ప్రజల మనోభావాలకు ఇబ్బందులు కలుగకుండా, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ సందర్భంగా విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వారసంతల్లో గోవులు విక్రయించకుండా పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పశువైద్యులను అందుబాటులో ఉంచి జంతువులను పరీక్షించేలా అధికారులు ఆదేశాలు జారీ చేయాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్: యువకుడి మృతి

హుజూరాబాద్ రూరల్, మే 30: పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారు కాకతీయ కెనాల్ వద్ద బైకును ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ధర్మరాజుపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన గాజె అంజి(20), వ్యవసాయ కూలీగా జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం హుజూరాబాద్‌లోని వారసంతకు వచ్చి తిరిగి, రాత్రి బైక్ (ఏపీ 15 ఏఈ 9644)పై వెళ్తుండగా పెద్దపాపయ్యపల్లి శివారులో కాకతీయ కెనాల్ వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా ఓవర్ టేక్ చేసిన ట్రాక్టర్ (ఏపీ 15బీబీ 7694) బైక్‌ను బలంగా ఢీకొట్టింది. కిందపడిపోవడంతో అంజి తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారమివ్వగా, అంజిని హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ హస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11 గంటలకు మరణించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో స్టాఫ్‌నర్స్‌కు తీవ్ర గాయాలు

మానకొండూర్, మే 30: మానకొండూర్ చెరువుకట్ట సమీపంలో కరీంనగర్ – వరంగల్ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ స్టాఫ్‌నర్స్ (ప్రభుత్వ ఉద్యోగి) తీవ్రంగా గాయపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బిజిలి లత మానకొండూర్ పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నది. ఆమె ప్రస్తుతం కరీంనగర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నది. విధి నిర్వహణలో భాగంగా లత ఉదయం తన ద్విచక్ర వాహనం (టీజీ 02 9326)పై కరీంనగర్ నుంచి మానకొండూర్ బయలుదేరింది. ఈక్రమంలో చెరువుకట్ట సమీపంలో లత ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ (ఏపీ 15 టీబీ 9632) ఢీకొట్టింది. ఈప్రమాదంలో లత రోడ్డుపై పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం లతను హైదరాబాద్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లత సోదరుడు బిజిలి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ చెప్పారు.

## నేడు తహసీల్ కార్యాలయంలో ఇసుక వేలం

కొత్తపల్లి, మే 30 : మండల పరిధిలో అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన సుమారు 33 ట్రాక్టర్ల ఇసుకను శనివారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తహసిల్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో ప్రజలు, గుత్తేదార్లు పాల్గొనాలని సూచించారు.

## రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్ జామ్

గంగాధర, మే 30: మండలంలోని మంగపేట సమీపంలోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై ఉన్న రైల్వే గేట్‌కు వ్యాన్ ఢీకొట్టడంతో ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది గేట్‌కు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. నిత్యం వేల వాహనాలు వెళ్లే కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారిలో ఉన్న రైల్వే గేట్ వద్ద తరచూ జరుగుతున్న ఇలాంటి ఘటనల వల్ల ట్రాఫిక్ జామ్ అవుతున్నదని ప్రయాణికులు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించి, సమస్య తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

## సబ్ జూనియర్ బాలికల ఓపెన్ హాకీ సెలెక్షన్లు

హుజూరాబాద్ టౌన్, మే 30: సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఓపెన్ హాకీ సెలెక్షన్లు జూన్ 1న ఆదివారం ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు కరీంనగర్ జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తిరునగరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలెక్షన్లలో పాల్గొనే బాలికలు తమ పేరును మే 31 సాయంత్రంలోగా ఐడీ కార్డ్, ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికెట్‌తో సంబంధిత జిల్లా హాకీ అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి మహమ్మద్ లియాకత్ అలీ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. సెలెక్షన్లకు హాజరయ్యే బాలికలు గుర్తింపు పత్రంగా ఆధార్ కార్డు లేదా సంబంధిత ఐడీ కార్డును వెంట తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు.

## వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కార్పొరేషన్, మే 30: రాష్ట్రంలో మున్సిపాలిటీలను నివాసయోగ్యమైన, స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన నగరాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిందని, దీనిని విజయవంతం చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు మొత్తం వంద రోజులు వివిధ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 'అందరి భాగస్వామ్యంతో ఒక చర్య.. ఒక మార్పు' నినాదంతో ఆయా కార్యక్రమాల్లో నగర ప్రజల భాగస్వాములను చేసి నగరాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నగర వ్యాప్తంగా మురుగు నీటి కాలువల్లో పూడిక తీయడం, ఇంటింటికీ అవగాహన కార్యక్రమాలు, గ్రీన్ ప్రొటోకాల్స్, హోం కంపోస్టింగ్ తయారు చేయడం, ఇంటి వద్దే చెత్తను వేరు చేయడం, కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్స్ తనిఖీ వాటి పరిశుభ్రత, రోడ్ల పక్కన పిచ్చి మొక్కలను తొలగించడం, డెంగ్యూ, మలేరియా విష జ్వరాల నివారణ చర్యలు, ట్రిపుల్ యాక్షన్ దోమల నియంత్రణ డ్రైవ్, కమ్యూనిటీ సమావేశాలు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### రాష్ట్ర ఆవిర్భా వ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు నగరపాలక సంస్థలో తగిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నగరపాలక సంస్థలో ఘనంగా నిర్వహించాలన్నారు. నగరపాలక సంస్థతో పాటు కళాభారతి భవనానికి చక్కటి లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని కోరారు. తెలంగాణ అమరవీరుల స్తూపంతో పాటు, తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సర్ విగ్రహం జంక్షన్లను పూలతో అలంకరించాలని ఆదేశించారు. వేడుకల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఈఈ సంజీవ్‌కుమార్, డీఈలు అయూబ్‌ఖాన్, వెంకటేశ్వర్లు, ఏఈలు సతీశ్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## 'పంచాయతీ అధికారులపై కేసు'

హుజూరాబాద్ టౌన్, మే 30: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ప్రకారం దాఖలైన దరఖాస్తును పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ అధికారిపై హుజూరాబాద్ కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదైందని న్యాయవాది ఆడెపు లింగమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన వేముల తిరుపతి (తండ్రి కొమురయ్య) 2023 మే 18న గ్రామపంచాయతీ కార్యాలయానికి సమాచారం కోసం రిజిస్టర్ పోస్టు పంపితే పంచాయతీ కార్యదర్శి ఆ పోస్టును తిరస్కరించడంతో, అది తిరిగి తిరుపతికి చేరిందని పేర్కొన్నారు. ఆ రిజిస్టర్ పోస్ట్‌పై పంచాయతీ కార్యదర్శి రిఫ్యూజ్ అని రాసి ఉండడంతో 2023 జూన్ 5న జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీనిపై హుజూరాబాద్ రెండో మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేయగా, కేసు వాదనలు పరిశీలించిన కోర్టు, అప్పటి పంచాయతీ కార్యదర్శి మట్ల రాజేశ్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యపై కేసు నమోదు చేయాలని ఇల్లందకుంట పోలీసులకు ఆదేశాలు జారీ చేసిందని న్యాయవాది పేర్కొన్నారు.

## ఇసుక లారీలపై చర్యలు తీసుకోవాలని వినతి

వీణవంక, మే 30: మండలంలోని మల్లారెడ్డిపల్లి ఇసుక రీచ్‌ల నుంచి వెళ్లే భారీ వాహనాల వల్ల రూ.లక్షల వ్యయంతో వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని గ్రామానికి చెందిన తెలంగాణ గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం సమ్మయ్య ఆరోపించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా మైనింగ్ ఏడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ, చల్లూరు, మల్లారెడ్డిపల్లి, దేశాయిపల్లి గ్రామాలకు సింగిల్ రోడ్డు మాత్రమే ఉందని, గతంలో ఇసుక లారీల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా రూ.5 లక్షల స్పెషల్ ఫండ్‌తో మరమ్మతులు చేపట్టారని తెలిపారు. సింగిల్ రోడ్డు కావడంతో లారీల రాకపోకలతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మల్లారెడ్డిపల్లి ఇసుక రీచ్‌కు వెళ్లే లారీల నుంచి గ్రామాన్ని ఉన్నతాధికారులు కాపాడాలని కోరారు.

## ఎస్‌యూలో చరిత్ర, టూరిజం విభాగం ఏర్పాటుకు వినతి

కార్పొరేషన్, మే 30: కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో చరిత్ర, టూరిజం డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని చరిత్ర పరిరక్షణ సమితి, రాష్ట్ర కమిటీ నాయకులు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శాతవాహన వంశ మూలపురుషుడైన శాతవాహనుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కాగా, శాతవాహనుడి విగ్రహ ఏర్పాటుకు ఉపకులపతి ఆచార్య ఉమేశ్‌కుమార్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని రిజిస్ట్రార్ తెలిపారు. కార్యక్రమంలో చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోతరవేణి తిరుపతి, వ్యవస్థాపకుడు డాక్టర్ సందవేణి తిరుపతి, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ టూరిజం ప్రొఫెసర్ గుజ్జెటి తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.రాజేందర్, టి. పుష్పలత, టి.రమేశ్, టి.శ్రీనివాస్, ఏ.కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాహితమే పరమావధిగా పని చేయాలి

హుజూరాబాద్ టౌన్, మే 30: స్వచ్ఛంద సంస్థలు ప్రజాహితమే పరమావధిగా పని చేయాలని హుజూరాబాద్ ఏసీపీ వీ మాధవి సూచించారు. శుక్రవారం పీవీ సేవా సమితి సభ్యులతో పాటు సిద్ధార్థనగర్ సొసైటీ అధ్యక్షుడు సాగి వీరభద్రరావు పట్టణంలోని కేసీ క్యాంపులో గల ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ మాధవిని కలిసి, శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి స్వచ్ఛంద సంస్థలు వారధిగా పని చేయాలన్నారు. దేశ అభివృద్ధిలో వాటి పాత్ర ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీవీ సేవా సమితి అధ్యక్షుడు తూము వెంకట రెడ్డి, సభ్యులు మనోజ్, విశ్రాంత పీడీ రాజిరెడ్డి, మురికి గౌరీశంకర్, సంపత్ రావు, శ్రీనివాస్ రావు, కన్నయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎరడపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

శంకరపట్నం, మే 30: మండలంలోని ఎరడపల్లి గ్రామంలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతుల సమస్యలపై చర్చించారు. ఎస్సీ కాలనీలో పారిశుధ్యంపై పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద తమ గ్రామానికి నలుగురు దళితులకు మాత్రమే పథకం కింద లబ్ధి చేకూరిందని, దళితుల్లో ఎంతో మంది నిరుపేదలు ఉన్నా వారికి మొండి చేయి చూపారని అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి, సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, ఎంపీవో ప్రభాకర్, గిర్దావర్ ప్రత్యూష, ట్రైనీ ఎస్ఐ సుమన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచులు రంజిత్ రావు, భద్రయ్య, అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు అంతడుప్పుల సతీశ్, దళిత సంఘం నాయకుడు నెలవేని మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వీణవంక, మే 30: మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జమ్మికుంట ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య హెచ్చరించారు. మండలంలోని వీణవంక, చల్లూరు వైన్స్ షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో జమ్మికుంట ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య మాట్లాడుతూ సీఐ మాధవీలత ఆదేశాల మేరకు వైన్స్ షాపులు, కోర్కల్, బేతిగల్, కనపర్తి బెల్ట్ షాపుల్లో తనిఖీలు చేట్టామని, అక్రమ మద్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు 16 లిక్కరు కేసులు నమోదు చేసి 67 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇది పంచాయతీ ఆవరణే..



బొమ్మనపల్లి జీపీ ఆవరణలో నిలిచిన మురుగు నీరు, చెత్తాచెదారం

చిగురుమామిడి, మే 30: గ్రామంలో పారిశుధ్యానికి ఆదర్శంగా ఉండాల్సిన గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో అపరిశుభ్రత నెలకొన్నది. మండలంలోని బొమ్మనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బాలవికాస కేంద్రం ఆధ్వర్యంలో తాగునీటి శుద్ధి కేంద్రంలో ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ వెనుక చెత్తాచెదారంతో పాటు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్గంధం వెలువడుతున్నది. బాలవికాస పాలకవర్గం, గ్రామపంచాయతీ సిబ్బంది నీటి నిలువలను తొలగించి పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని గ్రామస్తులు కోరుతున్నారు.